క్లుప్తంగా

అమ్మవారికి ఆషాఢం సారె



ద్రాక్షారామలో పారాయణ చేస్తున్న మహిళా భక్తులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ గ్రామ దేవత మండాలమ్మ అమ్మవారికి మంగళవారం గ్రామానికి చెందిన మహిళా భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి సన్నిధిలో లలితా సహస్ర పారాయణం చేశారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శాకంబరిగా పోలమ్మ అమ్మవారు



శాకంబరిగా దర్శనమిచ్చిన పోలమ్మ వారు

రాయవరం: పరిసర గ్రామాల ప్రజలకు కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్న పోలమ్మ అమ్మవారు మంగళవారం 'శాకంబరి'గా దర్శన మిచ్చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పోలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని 250 కిలోల కూరగాయలతో సుందరంగా అలంకరించారు. గర్భగుడిలో ఉన్న పోలమ్మ అమ్మవారితో పాటుగా మూల విరాట్టులను కూడా కూరగాయలతో అలంకరించారు. బీర, బెండ, ఆనప, దొండ, సొరకాయ వంటి కూరగాయలతో శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారి రూపాన్ని చూసేందుకు భక్తులు బారులు తీరారు.

ఘనంగా పాస్టర్ల ఫెలోషిప్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న సత్యం, ఫెలోషిప్ సభ్యులు

కె.గంగవరం: మండల కేంద్రం కె.గంగవరంలోని దీవెన గ్రౌండ్ చిన్నమంద చర్చి ఆవరణలో యునైటెడ్ పాస్టర్ల ఫెలోషిప్ జిల్లా ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవ సంఘాల సమస్యలను మంత్రి ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని వినతిపత్రం అందజేశారు. ఫెలోషిప్ అధ్యక్షుడు కార్ల డేవిడ్ కొమనాపల్లి ఆధ్వర్యంలో ఫెలోషిప్ ప్రతినిధులు, పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఫెలోషిప్ ప్రతినిధులు జాన్ విక్టర్ నందా, ముంగి యహోసువ, సలాది జకరయ్య, యు.భాస్కరరావు, ఎర్నెస్ట్, ఎస్తేరు తాతపూడి, గునుపే విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు వద్ద బీమా శిబిరం

మండపేట: భారత ప్రభుత్వం, పోస్టల్ అనుబంధ సంస్థ అయిన ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ గ్రూప్ ఆక్సిడెంట్ గార్డ్ పాలసీలు ప్రవేశపెట్టినట్టు స్థానిక పోస్టల్ సిబ్బంది కొండపల్లి సూర్యనారాయణ, కేవీ నారాయణరావు తెలిపారు. పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన ఇన్సూరెన్స్ శిబిరాన్ని పోస్టు మాస్టర్ జి. శివయ్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 18–65 వయస్సు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పాలసీ అవసరమన్నారు. బుధవారం ప్రత్యేక మేళా స్థానిక మండపేట పోస్ట్ ఆఫీస్‌లో ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ టి.పుల్లేశ్వరరావు, కె. ఈశ్వరరావు, జి.వెంకట్రావు, చెల్లుబోయిన శ్రీనివాస్,ఎస్. దుర్గాదేవి, ఎం.అనూష, ఎండీఎం షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు మెరుగుపరచాలి



వాకతిప్ప పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్రమౌళితో చర్చిస్తున్న ఎంపీడీఓ కొండలరావు

కపిలేశ్వరపురం: సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రస్తుత సీజన్‌లో ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలను మరింతగా మెరుగు పరచాలని ఎంపీడీఓ కొండలరావు ఆదేశించారు. మండలంలోని వాకతిప్ప పీహెచ్‌సీని మంగళవారం ఆయన సందర్శించారు. వైద్యాధికారి చంద్రమౌళి పీహెచ్‌సీ పరిధిలో అందిస్తున్న సేవలను ఎంపీడీవోకు వివరించారు. టేకి తదితర గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించినట్టు తెలిపారు. ఆసుపత్రి రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు.

పిలక దశలో వరి

- కలుపుతీతలు ప్రారంభించిన రైతులు
- వాతావరణ పరిస్థితుల మేరకు ఎరువులు వాడాలంటున్న నిపుణులు



కొప్పిశెట్టి ప్రభాకర్



రాయవరంలో కలుపు తీస్తున్న కూలీలు

రాయవరం: ప్రస్తుత ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఖరీఫ్‌కు వాతావరణం అనుకూలించడంతో ఇంచుమించుగా అనుకున్న సమయానికే వరినాట్లు పూర్తయ్యాయి. గతేడాది ఖరీఫ్ మాదిరిగానే ఈ ఖరీఫ్‌లో కూడా మంచి దిగుబడులు సాధిద్దామన్న ఆశతో రైతులు సేద్యం చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ ఆశాజనకంగానే ఉందని వ్యవసాయ శాఖ చెబుతోంది.

క్లస్టర్ పరిధిలో..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలల్లోని 1.01 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో స్వర్ణ రకాన్ని 75 శాతం, ఎంటీయూ 1318 రకాన్ని 10 శాతం సాగు చేస్తుండగా, ఎంటీయూ 1061 (ఇంద్ర), రబీకి విత్తనాలను సిద్ధం చేసుకోవడంలో భాగంగా ఎంటీయూ 3626 (బొండాలు), ఎంటీయూ 1112, 1064, 1269, బీపీటీ 5204 తదితర రకాలను 15 శాతం రైతులు సాగు చేస్తున్నారు.

కలుపు తీతలు ప్రారంభం

రైతులు కలుపు తీతలు ప్రారంభించారు. ముందస్తుగా వరినాట్లు వేసిన పొలాల్లో వరి పంట పిలక దశలో ఉంది. కలుపుతీతకు ఇప్పటికే పలువురు రైతులు కలుపు నివారణ మందులను వాడుతున్నారు. అధికంగా కలుపు ఉన్న పంట చేలల్లో రైతులు కూలీలతో కలుపు తీయిస్తున్నారు. కలుపు ఎక్కువగా ఉంటే వేసిన ఎరువులు అక్కరకు రావనే ఉద్దేశంతో రైతులు కలుపుతీతకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

పాటించాల్సిన సూచనలివే..

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తగిన సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ రైతులకు సూచిస్తున్నారు. మొదటి దఫా ఎరువులు వేసేటపుడు ఎకరానికి 15–20 కేజీల పొటాష్ ఎరువులు వాడాలి. చిరుపొట్ట దశలో పొటాష్ వేయడం వలన మొక్కకు ధృఢత్వం పెరగడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తితో పాటు గింజ నాణ్యత పెరుగుతుంది. తొలకరి సీజన్‌లో ఊడ్చిన 35 రోజుల వరకూ పురుగు మందులు వాడకూడదు. పిలకల దశలో హానిచేసే పురుగులు నష్టపరిచే స్థాయిని మించి ఉంటే తప్ప పురుగు మందులు వాడరాదు. వరికి పునరుత్పత్తి శక్తి ఉండడం వలన కొన్ని పిలకలు పోయినా తిరిగి పిలకలు తొడుగుతుంది. 35రోజుల పాటు పురుగు మందులు వాడక పోవడం వలన మిత్ర పురుగులు పెరిగి పంటకు రక్షణగా నిలుస్తాయి. అదే సమయంలో రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుంది. పురుగు మందులు ఇష్టానుసారం వాడితే మిత్రపురుగులు నశించి శత్రు పురుగులు పెరిగి పంటకు నష్టం కలిగిస్తాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎరువుల వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి. ముఖ్యంగా నత్రజని ఎరువును వాడకూడదు. నత్రజని ఎరువు వాడితే వరి అధికంగా పెరిగి, పంటకు చేతికి వచ్చే దశలో నేలనంటే అవకాశముంది.

అధికంగా వాడితే అనర్థమే

ప్రస్తుతం వర్షాలు అధికంగా కురుస్తున్నందున ఎరువులు అధికంగా వాడరాదు. అధికంగా ఎరువులు వాడితే చీడపీడలు ఆశించి, పెట్టుబడి ఖర్చు అధికమవుతుంది. వెదజల్లు విధానంలో సాగు చేసిన పొలాల్లో వరినారు మధ్య ఖాళీలు ఉన్న చోట్ల రైతులు వరినాట్లు వేస్తున్నారు. కలుపుతీతలతో పాటుగా మనేదలు వేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రస్తుతం అక్కడక్కడా ఉల్లికోడు ఈగ వరిపంటను ఆశిస్తుంది. దీని వలన కొత్తగా ఆకురాకుండా ఆకు గొట్టంలా చుట్టుకుపోతుంది. ఫలితంగా అక్కడితో పెరుగుదల ఉండదు. దీని నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 10 కేజీల వంతున వేసుకుని నివారించుకోవాలి.

ప్రజా సమస్యలపై వాడీవేడిగా చర్చ

- చైర్‌పర్సన్‌ను అభినందించిన ఎమ్మెల్యే వేగుళ్ల
- మండపేట మున్సిపల్ సమావేశం



సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు



చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పలు ప్రజా సమస్యలపై మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వాడీవేడిగా చర్చ జరిగింది. చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరయ్యారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య గుదిబండలా మారిందని, నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అన్న క్యాంటీన్ భవనం మరమ్మతులకు నిధులు కేటాయించిన చైర్‌పర్సన్ దుర్గారాణిని, కౌన్సిల్ సభ్యులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అభినందించారు. దీనిపై రెడ్డి రాధాకృష్ణ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ పునః ప్రారంభం కావడం తమకు కూడా ఆనందమే అన్నారు. పట్టణంలో జరిగే అభివృద్ధి పనులకు తమ తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు.

ఆటోలను వినియోగంలోకి తీసుకురండి

స్థానిక వాటర్ వర్క్స్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న చెత్తను తరలించే 16 ఆటోలను వినియోగంలోకి తేవాలని టీడీపీ కౌన్సిలర్ కాశిన కాశీవిశ్వనాథం కోరారు. ఆటోలను వినియోగంలోకి తేవాలంటే వాటికి డ్రైవర్లు అవసరమని కమిషనర్ బి. రాము బదులిచ్చారు. అలాగే ఆటోల మరమ్మతులకు కొన్ని కొత్త పరికరాలు కూడా కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ అంతంత మాత్రంగా ఉందని టీడీపీ కౌన్సిలర్ చుండ్రు సుబ్బారావుచౌదరి ఆరోపించారు. బ్లీచింగ్ కూడా చల్లకుండా కేవలం ముగ్గు చల్లి చేతులు దులుపుకుంటున్నారని తప్పుబట్టారు. అలాగే గతంలో పని చేసిన కమిషనర్ పాల్పడిన అవక తవకలపై విచారణ జరిపించాలని కోరారు. గొల్లపుంత కాలనీ మున్సిపల్ షాపుల అద్దెలు స్వాహా చేసిన వారిపై చర్యలు తీసుకున్నారా? అని ప్రశ్నించారు. పట్టణంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ సమస్యలపై పలువురు కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కౌన్సిలర్ యరమాటి గంగరాజు మాట్లాడుతూ వాణీమహల్ సెంటర్ నుంచి సూర్యమహల్ వరకూ ట్రావెలర్స్ బంగ్లా మున్సిపల్ షాపు నిర్వాహకుల తీరును తప్పుబట్టారు. ఇష్టానుసారంగా రోడ్డు ఆక్రమించి సామాన్లు పేర్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కలవపువ్వు సెంటర్, రాజారత్న, వాణీమహల్ తదితర సెంటర్లలో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోందన్నారు. ఈ సెంటర్లలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యపై సభ్యులు రెడ్డి రాధాకృష్ణ, చుండ్రు సుబ్బారావు చౌదరి కూడా మాట్లాడారు.

సమస్య వాస్తవమే..

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్పందిస్తూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య క్లిష్టంగా ఉన్న విషయం వాస్తవమేనని పేర్కొన్నారు. ముందుగా తాను, కౌన్సిల్లోని 33 మంది సభ్యులూ తమతమ ఇళ్ల వద్దా, షాపుల వద్ద లేదా వాణిజ్య సంస్థల వద్దా ఏమైనా ఆక్రమణలు ఉంటే స్వచ్ఛందంగా తొలగించుకుందామన్నారు. అనంతరం సమావేశం వేసి ఆక్రమణల తొలగింపుపై చర్చిస్తే బాగుంటుందన్నారు. ప్రణాళిక బద్ధమైన పట్టణాన్ని నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు కౌన్సిలర్లతో కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఇందుకు తాను కూడా సహకరిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో వైస్‌చైర్మన్లు వేగుళ్ల నారాయణరావు, పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి



మాచరలో మానవ అక్రమ రవాణాపై మాట్లాడుతున్న సీడీపీఓ గజలక్ష్మి

కపిలేశ్వరపురం: ఆధునిక సమాజంలో మానవ అక్రమ రవాణా పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్టు సీడీపీఓ అధికారి గజలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని ఐసీడీఎస్, శ్రమ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గజలక్ష్మి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వంద రోజుల పాటు అక్రమ రవాణాకు చట్టపరమైన, మానవ రక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించామన్నారు. శ్రమ కో- ఆర్డినేటర్ ఈశ్వరి మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు అపరిచిత వ్యక్తుల పట్ల అవగాహనతో వ్యవహరించాలన్నారు. పిల్లలను సున్నితంగా కాకుండా సమాజం పట్ల అవగాహనతో పెంచాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, శ్రమ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లతో విజ్ఞాన సముపార్జన



విద్యార్థుల ట్యాబ్‌లను పరిశీలిస్తున్న డీఈఓ

అంబాజీపేట: ఉన్నత పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థులు ట్యాబ్‌ల వినియోగాన్ని పెంచి విజ్ఞానాన్ని సముపార్జించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యా శాఖాధికారి ఎం .కమలకుమారి అన్నారు. జి.అగ్రహారం ఉన్నత పాఠశాలను సీఎంఓ బొరుసు వీవీ సుబ్రహ్మణ్యంతో కలసి మంగళవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రణాళికతో కష్టపడి ప్రతి సబ్జెక్టును ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనంతరం ట్యాబ్‌లను, విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిస్తున్న వరద గోదారి

- ఊపిరి పీల్చుకుంటున్న ప్రజలు
- బాధితులకు నిత్యావసరాల పంపిణీకి సన్నద్ధం



కోటిపల్లి రేవు ఫెర్రీలోని మర్రి చెట్టు మొదలు వరకూ వరద ప్రవాహం

కె.గంగవరం: ఉగ్రరూపం దాల్చిన గోదావరి మంగళవారం ఉదయం నుంచి కాస్త తగ్గుముఖం పట్టింది. సోమవారంతో పోలిస్తే మంగళవారం సాయంత్రానికి మూడు అడుగుల మేర వరద తగ్గిందని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. వరద ఉధృతి తగ్గుతుండడంతో గోదావరి పరివాహక ప్రజలు, ముంపు గ్రామాల వారు ఊపిరి పీల్చుకున్నారు. కోటిపల్లి రేవులోని ఫెర్రీ వద్ద పుష్కర ఘాట్ మెట్ల దిగువ వరకు ప్రస్తుతం వరద నీరు ప్రవహిస్తోంది. కోటిపల్లిలోని మత్స్యకార కాలనీలో గోదావరి గట్టున ఉన్న పాకల వద్ద కూడా నీటిమట్టం తగ్గింది. శేరిలంక గ్రామం గోదావరి మధ్యలో ఉండడం వల్ల వరద ఉధృతి ఇంకా కొనసాగుతోంది. గ్రామ ప్రారంభంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ప్రాంగణం వరకు వరద ప్రవహిస్తోంది.

సందర్శకుల తాకిడి

గోదావరి వరద రావడంతో కోటిపల్లిలోని వరద ఉధృతిని చూసేందుకు పలు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో కోటిపల్లికి చేరుకుంటున్నారు. రేవు గట్టు వద్ద వందలాది జనం చేరుకుని, గోదావరి పూర్తిగా శాంతించాలని పూజలు చేస్తున్నారు. కొందరు సెల్ఫీలు తీసుకుంటున్నారు. జనం తాకిడితో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నారు.

లంక గ్రామాలను వీడిన వరద

కపిలేశ్వరపురం: మండలంలోని లంక గ్రామాల శివారు ప్రాంతాలను వరదనీరు వీడింది. దీంతో లంక గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నారాయణలంక కాజ్‌వేపై వరదనీరు వీడడంతో రాకపోకలు పునరుద్ధరించారు. ధవళేశ్వరం వద్ద ఒకటో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండడంతో సచివాలయ ఉద్యోగులు మంగళవారం సైతం వరద ప్రాంతాల్లో విధుల్లో కొనసాగారు. కార్యదర్శి సీహెచ్.నరసింహారావు పర్యవేక్షణలో అద్దంకి వారిలంక, కేదారిలంక, పల్లపులంక, వీధివారి లంక గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ పనులను సర్పంచులు వీధి వెంకటరెడ్డి, నాతి గవరయ్య, వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి నాగేశ్వరరావు పర్యవేక్షించారు. వరద బాధితులకు పంపిణీ చేసేందుకు బియ్యం, బంగాళాదుంపలు, ఉల్లిపాయలను సిద్ధం చేసినట్టు తహసీల్దార్ రాజరాజేశ్వరి, ఎంపీడీఓ కొండలరావు తెలిపారు. వాటిని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు పంపిణీ చేయనున్నట్టు వివరించారు.



నారాయణలంకలో వైద్య శిబిరంలో సూచనలు చేస్తున్న గ్రామాధికారులు



కోటిపల్లి రేవులోని పంటు ఎక్కే మార్గంలో షాపుల వద్ద వరద



దంగేరు శివారు కొత్తకొంపల వద్ద నీటిలో నానుతున్న అరటి, మిర్చి పంటలు

పాఠ్య పుస్తకాల పంపిణీ



జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న స్థానిక నేతలు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామారావు అధ్యక్షతన నిర్వహించిన మంగళవారం కార్యక్రమంలో స్థానిక నేతలు వుండవిల్లి రాంబాబు, దేవిశెట్టి చిన్ని, వల్లూరి శ్రీనివాస్ తదితరులు చేతుల మీదుగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ విద్యార్థులకు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రామారావు మాట్లాడుతూ కళాశాలలోని 127 మంది విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, 12 రకాల నోట్ పుస్తకాలతో పాటుగా, బ్యాగ్‌ను కూడా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డీవీవీ నాగేశ్వరరెడ్డి, లైబ్రేరియన్ ప్రకాష్, అధ్యాపకులు చంద్రశేఖర్, వర్మ, శివన్నారాయణ, విజయకుమారి, అనంతకుమారి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతులు



చేతి పంపునకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

రామచంద్రపురం: మున్సిపాలిటీ పరిధిలో గత కొంత కాలంగా పాడైపోయి ఉన్న చేతి పంపులకు మున్సిపల్ సిబ్బంది మంగళవారం మరమ్మతులు చేపట్టారు. స్థానిక మూడో వార్డులో నీళ్లు రాకుండా పాడైన పంపులకు సిబ్బంది రిపేర్ చేసి, వినియోగంలోకి తెచ్చారు.

కూచిపూడిలో చిన్నారుల ప్రతిభ



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న రామచంద్రపురం కళాకారులు

రామచంద్రపురం: కూచిపూడి నృత్యంలో రామచంద్రపురం చిన్నారులు ఉత్తమ ప్రతిభను కనబర్చి బహుమతులను కైవసం చేసుకున్నారు. భావయామి ఇన్స్టిట్యూషన్స్ ఆఫ్ ఆర్ట్స్, కూచిపూడి డ్యాన్స్ అకాడమీ గురుశ్రీ చక్రవర్తుల పవన్‌కుమార్, పురాణం సృజన రవిచంద్రిక శిష్య బృందం ఇటీవల తిరుపతి మహతి ఆడిటోరియంలో అభినయ ఆర్ట్స్(తిరుపతి) వారి సౌజన్యంతో ఎనిమిది రోజుల పాటు నృత్య, నాటక పోటీలు నిర్వహించినట్టు సంస్థ నిర్వాహకులు మంగళవారం విలేకరులకు వివరించారు. ఈ పోటీల్లో జూనియర్స్ సోలో విభాగంలో డి.అఖిల. సీనియర్స్ సోలో విభాగంలో ఎస్ కావ్యశ్రీ. జూనియర్స్ గ్రూప్‌లో యు.మహిత, యు.అన్విత, బి.గ్రీష్మ, జి.అదర్శిణి, ఎ.భవ్యఈశ్వరి, కె.సాత్విక, ఎస్.రోహిత్ ఉత్తమ ప్రదర్శనలు చేశారని చెప్పారు. సీనియర్స్‌లో నందూరి లక్ష్మీమోక్ష, టి.శ్రీజ, డి.తులసి, డి.ఆశ్రిత, డి.దివ్య ఉత్తమ ప్రదర్శన ఇచ్చి బహుమతులు అందుకున్నట్టు తెలిపారు.

వ్యక్తికి పాము కాటు

సఖినేటిపల్లి: ముంపు గ్రామమైన అప్పనరాముని లంకకు చెందిన దొంగ పవన్‌సాయి మంగళవారం పాముకాటుకు గురయ్యాడు. పశువుల మేతం కోసం పచ్చిగడ్డి కోస్తున్న సమయంలో పాము అతడిని కాటేసింది. అతడిని గమనించిన స్థానికులు హుటాహుటిన టేకిశెట్టిపాలెం వద్ద ఉన్న వైద్య శిబిరానికి తరలించారు. సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గా కావ్య పర్యవేక్షణలో సిబ్బంది ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన వైద్యానికి 108లో రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.